క్లుప్తంగా

బతుకమ్మకు ఏర్పాట్లు చేయకపోవడం సిగ్గుచేటు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట: బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడం సిగ్గుచేటని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. బతుకమ్మ పండుగను పట్టించుకోకపోవడంతో పల్లెలకు కళ తప్పినట్లయిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారని, ఫీల్డ్ అసిస్టెంట్లు, పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సావణ పెల్లి అనిల్, మీసరగండ్ల అనిల్‌కుమార్, కూనబోయిన రఘు, కుమార్, బాగయ్య, శ్రీనివాస్, రమేశ్, గుంటి మధు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుహతులు ప్రదానం చేశారు. విన్నర్‌గా నిలిచిన కాంత్, రన్నర్‌గా నిలిచిన సాయిలతో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, ప్రభాకర్, ఆంజనేయులు, శ్రీనివాస్, ధర్మపురి, శ్రావణ్‌కుమార్, ఆది విష్ణు, భిక్షమయ్య, కృష్ణప్రసాద్, సుచరణ్, మనోహర్, జగన్నాథం, మహేశ్, శ్రీనివాస్, రవి, శైలజ, దీపిక, భార్గవి, రమ్య పాల్గొన్నారు.

దుర్గామాత శోభాయాత్ర



బోయినపల్లి: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బోయినపల్లి యువమిత్ర యూత్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గామాత ఆగమన్ (శోభాయాత్ర) ఉత్సాహంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని వీరనగర్ నుంచి 20 కార్ల కాన్వాయ్‌తో దుర్గామాత ఆగమన్ ర్యాలీ చేపట్టారు. భక్తుల కోలాటాలు.. బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి.

కందికట్కూర్ పాఠశాలకు ఉపాధ్యాయుడి కేటాయింపు

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ ప్రాథమిక పాఠశాలకు టీచర్‌ను కేటాయిస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీచేశారని మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్ గౌడ్ ఆదివారం తెలిపారు. పాఠశాలలో 87మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయులు ఇద్దరే ఉన్నారు. గ్రామస్తులు ఈనెల 8న ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వేములవాడ మండలం బాలరాజుపల్లి హైస్కూల్ నుంచి ఉపాధ్యాయుడిని కందికట్కూర్ పాఠశాలకు కేటాయిస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీచేశారు. పాఠశాలకు ఉపాధ్యాయుడిని కేటాయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఐటీయూలో చేరిక



బోయినపల్లి: మండలంలోని కొత్తపేట గ్రామ భవన నిర్మాణ కార్మికులు ఆదివారం సీఐటీయూలో చేరినట్లు భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గురజాల శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తపేట సీఐటీయూ గ్రామ భవన నిర్మాణ రంగం కార్యదర్శిగా చిందం వేణు, కమిటీ సభ్యులుగా దావనపల్లి నరేశ్, చిందం నరేశ్, తాళ్లపల్లి పర్శరాములు, రాజేందర్, తంబ శ్రీధర్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ద్యావనపెల్లి కమలాకర్, రామంచ అశోక్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతకు ఆర్ఎస్ఎస్ కృషి

ఎల్లారెడ్డిపేట: హిందువుల ఐకత్యకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ యేలిగేటి వంశీకృష్ణ అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో భాగంగా హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు.

మన్నుగున్న పాముకు వైద్యం

వేములవాడఅర్బన్: రాజన్నసిరిసిల్ల జిల్లా చంద్రంపేటకు చెందిన కాటిపాపల వారు మన్నుగున్న పామును పెంచుకుంటున్నారు. అనుకోకుండా గడ్డపార తాకడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే వెటర్నరీ డాక్టర్ అభిలాశ్ దగ్గరకు తీసుకురాగా.. చికిత్స చేసి కాపాడారు. ఈ సంఘటన మూడు రోజుల క్రితం జరిగింది

ఎంగిలిపూల వేడుకలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో అంటూ ప్రధాన కూడళ్ల వద్ద ఆడిపాడారు. ఉయ్యాల పాటలు, బతుకమ్మ ఆటలతో సందడి చేశారు. అనంతరం సమీప చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. తొలిరోజు ఎంగిలిపూలతో ప్రారంభమైన వేడుకలు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్


సిరిసిల్ల విద్యానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, తదితరులు


సిరిసిల్లలో బతుకమ్మలతో మహిళలు


తంగళ్లపల్లి : అంకుశాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


సిరిసిల్లలో వేంకటేశ్వర ఆలయం ముందు ..


వేములవాడ : ధర్మగుండంలో బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న మహిళలు


వీర్నపల్లి మండల కేంద్రంలో ..


వేములవాడ అర్బన్: నాంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బోయినపల్లి: కృష్ణనగర్‌లో బతుకమ్మ సంబరాలు


గంభీరావుపేట: బతుకమ్మలతో మహిళలు


వేములవాడరూరల్ : వట్టెంలలో..


ఎల్లారెడ్డిపేటలో..


కోనరావుపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చందుర్తి: బండపల్లిలో..


ముస్తాబాద్: శివకేశవుల ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఇల్లంతకుంటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఎల్లారెడ్డిపేట : బతుకమ్మ సంబరాల్లో మహిళలు


సిరిసిల్ల అర్బన్ : రగుడులో..

నిందితులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సిరిసిల్ల అర్బన్: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేశ్ హత్య చేసిన హేయమైన చర్య అని దళిత సంఘాల నాయకులు రాగుల రాములు, ఆకునూరి బాలరాజు, నాలుక సత్యం అన్నారు. సోమవారం సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దళిత నాయకుడిని పాశవికంగా హత్య చేయడం వెనుక పలు అనుమానాలు ఉన్నాయన్నారు. నిందితులను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. మృతుడి కుటుంబానికి రక్షణ కల్పించి వారిని ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు పంపిణీ చేయండి


మాట్లాడుతున్న రాకేష్

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్నా పంపిణీ చేయకపోవడం శోచనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సావనపల్లి రాకేష్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. మౌలిక వసతులు లేవనే కారణంతో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేయలేదన్నారు. దసరా సందర్భంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల యువజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు మామిడి విజయ్, బహుజన ఉద్యమకారులు ఏనుగుల లింగన్న, దాసరి రవి, తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


తంగళ్లపల్లిలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించిన పద్మశాలీ నాయకులు

తంగళ్లపల్లి: కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని తంగళ్లపల్లి, పద్మనగర్ పద్మశాలీ సంఘాల అధ్యక్షులు రాపెల్లి ఆనందం, మోర శ్రీకాంత్ అన్నారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాపూజీ అడుగుజాడల్లో ముందుకు వెళ్తూ వెనకబడిన వార్గల అభ్యున్నతికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోర రాజు, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, యూత్ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మచ్చ ఆంజనేయులు, సామల రమేశ్, కుమ్మరికుంట శ్రీహరి, సామల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఉడుత సంతోష్, బాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీరాం సుదర్శన్, గోషిక దేవదాసు, సంయుక్త కార్యదర్శి రాపెల్లి అంబదాస్, కోశాధికారి వనం బాల్‌రాజు, యూత్ అధ్యక్షులు సుంకి భాస్కర్, ప్రధాన కార్యదర్శి విష్ణుమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఆదివారం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో పితృ అమవాస్యను పురస్కరించుకుని అన్నదానం చేశారు. కార్యక్రమంలో అల్మాస్పూర్ శ్రీను గురుస్వామి, ప్రచార సమితి మండల అధ్యక్షుడు చకిలం మధు, ఉపాధ్యక్షులు శ్రీరామోజు భాస్కర్, కన్వీనర్ రామోజు, శేఖర్, ప్రధాన కార్యదర్శి దేవరాజు, చంద్రమోహన్ రెడ్డి కొల బాపురెడ్డి, రవి, దూస శ్రీనివాస్, అల్లాడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని రేణుకామాత ఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల రమేశ్‌గౌడ్‌తో పాటు 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆలయం నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. దాతల నుంచి విరాళాలు సేకరించాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతు




వేములవాడరూరల్: మండలంలోని తుర్కాషినగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. కొన్నేళ్లుగా బురదరోడ్లతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించి రోడ్డు నిర్మాణానికి రూ. 2లక్షల 30వేలు మంజూరు చేశారు. రోడ్డు పనులను ప్రారంభించి మట్టితో చదును చేశారు. కార్యక్రమంలో రూరల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్, గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.

రైతును కాటువేసిన పాము

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రైతు లంబ సత్తయ్య ఆదివారం తన పొలం వద్దకు వెళ్లాడు. పంట చేనును పరిశీలిస్తుండగా నాగుపాము కాటువేసింది. గమనించిన సమీపంలోని రైతులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సత్తయ్యను మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కొండచిలువ హతం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై గాయత్రి డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి కొండచిలువ సంచరించింది. కొండచిలువను చూసిన శివారు ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొండచిలువను గమనించిన వాహనదారులు బండరాళ్లతో హతమార్చారు. గ్రామ శివారులోని ఇండ్ల మధ్యలోనే కొండచిలువ సంచారం కలకలం రేపింది.





చందుర్తి : చందుర్తి, వేములవాడ రూరల్ మండలాలైనా ఎన్గల్–హన్మాజీపేట గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు మూలమలుపు వద్ద వరద ప్రవాహంతో కోతకు గురైంది, ఎదురెదురుగా వాహనాలు వస్తే సైడ్ ఇవ్వడం కష్టంగా మారింది. దీంతో వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : నవ్యశ్రీ
ఆర్అండ్‌బీ ఏఈ, చందుర్తి సెల్: 9392494019

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పూలే ఆశయాలను కొనసాగించాలి


జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రసమయి, నాయకులు

ఇల్లంతకుంట: జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలని మానకొండూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్ద లింగాపూర్‌లో ఆదివారం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పండుగ సాయన్న, విగ్రహాలను ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ఎలవేణి రమేశ్, రాష్ట్ర ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకుడు అంబర్‌పేట శంకర్, జిల్లా మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ చొప్పరి రామచంద్రం, జితేందర్ గౌడ్, జిల్లా ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు


మాట్లాడుతున్న జిందం కళ

సిరిసిల్ల అర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని బతుకమ్మ ఘాట్‌వద్ద పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిన మహిళలు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గుగులోతు రేణ, చేరాల స్వాతి, వడ్లూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'చల్మెడను విమర్శిస్తే సహించం'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోనరావుపేట: బీఆర్ఎస్‌లో 25 ఏళ్లుగా ఉండి ఎన్నో పదవులు అనుభవించిన బండ నర్సయ్య ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ, ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావును విమర్శిస్తే సహించబోమని బీఆర్ఎస్ మండల నాయకులు హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడారు. చల్మెడ వలసవాది కాదన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు కూడా చల్మెడ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నారన్నారు. పార్టీ మారిన మూడు రోజులకే బండ నర్సయ్య పార్టీపై, ఇన్‌చార్జిపై ఇలా మాట్లాడడం సరికాదన్నారు. వెన్నుపోటు పొడిచే నాయకుడు మీ దగ్గరే ఉన్నారని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్య , సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, నాయకులు పొన్నం పర్శరాములు, శ్రీనివాస్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివకేశవ ఆలయంలో ఉత్సవాలు

- ముస్తాబైన శివకేశవ ఆలయం


బొప్పాపూర్‌లో ఉత్సవాలకు ముస్తాబైన శివకేశవ ఆలయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గల కాకతీయ కాలంనాటి శివకేశవ, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. 22న శాంతి పాఠం, మహా గణపతి పూజ, అఖండ దీపారాధన, మాతృక, నంది దేవతామాన్వం, ఆచార్యాది ఋత్విగ్వరణము, పంచగవ్య ప్రాశనం, కంకణధారములు తీర్థపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ యోగిని, ప్రధాన కలశస్థాపన, మధ్యాహ్నం మూడు గంటలకు అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, స్థాపిత దేవతాహ్వానం పూజలు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయి. 23న అవాహిత దేవతా పూజలు, దేవతా హవనములు, ఆది వాసంగ హోమాలు, రుద్ర స్వహాకారములు, శ్రీ సూక్తహవనములు, మధ్యాహ్నం ధాన్యాధి వాపములు, పుష్పాదివాసం, ఫలదీవాసం, సాయంత్రం ప్రదోషకాలపూజ, హారతి, తీర్థప్రసాద వితరణ 24న చివరి రోజు శివ కేశవ ఆలయాలపై కుంబాభిషేకాలు జరుపనున్నారు. హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, జయాధిహోమాలు, కుంబాభిషేకాలు, స్వామివారి క ల్యాణం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలుంటాయని, జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల చివరి రోజు స్వామివార్లను ఊరేగించేందుకు గ్రామానికి చెందిన రుద్రోజు లక్ష్మణ్ ప్రత్యేకంగా టేకు కలపతో పల్లకీని తయారు చేశారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే హో మ గుండాలను గ్రామానికి చెందిన పలువురు మహిళలు ముస్తాబు చేశారు. బ్రహ్మశ్రీ రాచర్ల విశ్వనాథం శర్మ, రాచర్ల శ్రీనివాస శర్మ, కొండపాక శ్రీధరాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఉత్సవాల పూజలు జరుగనున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వానరానికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి వానరానికి గాయాలయ్యాయి. సెస్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రా న్స్ ఫార్మర్‌పై కోతిని కిందికు దింపారు. దీంతో మ . ధ్యాహ్నం వరకు సెస్ అధికారులు విద్యుత్ స ర ఫరా నిలిపివేసి మరమ్మతు పనులు చేపట్టారు.